పెనుగంచిప్రోలులో అభివృద్ధి పరుగులు

- రూ.27కోట్లతో అభివృద్ధి పనులు
- పాఠశాలలకు కార్పొరేట్ హంగులు
- తీరనున్న మంచినీటి సమస్య
- శరవేగంగా పార్కు నిర్మాణం
- శ్రీతిరుపతమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.14కోట్లు



ప్రజలకు సేవలందిస్తున్న పెనుగంచిప్రోలులోని సచివాలయం



పెనుగంచిప్రోలు: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీతిరుపతమ్మవారు వెలిసిన పెనుగంచిప్రోలులో అభివృద్ధి పరుగులుపెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను సహకారంతో కోట్లాది రూపాయల నిధులతో గతంలో ఎన్నడూలేని విధంగా పెనుగంచిప్రోలు శరవేగంగా అభివృద్ధి జరుగుతోంది.

రూ.3.34కోట్లతో పాఠశాలల అభివృద్ధి..

గతంలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు పలు సమస్యలతో కునారిల్లాయి. నేడు సీఎం జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపమే పూర్తిగా మారిపోయింది. నాడు–నేడు పెనుగంచిప్రోలులోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సీఎం జగనన్న ప్రభుత్వం రూ.3.34కోట్లు కేటాయించింది. ఈ నిధులలో రూ.1.43 కోట్లతో కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిది అదనపు తరగతి గదులు నిర్మించారు. అవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అలాగే జెడ్పీ బాలికల పాఠశాలలో రూ.80 లక్షలు, ఒకటో వార్డులోని ప్రాథమిక పాఠశాలలో రూ.16 లక్షలు, ప్రాథమిక పాఠశాలలో(మెయిన్) రూ.14 లక్షలు, తుఫాన్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో రూ.14లక్షలతో మౌలికసదుపాయాలు కల్పించారు. ఇలా ప్రభుత్వం పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించడంతో ఇప్పుడు వసతుల కల్పనలో ప్రైవేట్ పాఠశాలలే ప్రభుత్వ పాఠశాలలతో పోటీపడాల్సిన పరిస్థితి నెలకొంది. అదేవిధంగా గ్రామంలోని మూడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ఒక్కో దానికి రూ.15 లక్షలు చొప్పున రూ.45 లక్షలు కేటాయించగా పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో రూ.7లక్షలతో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించారు.


అమ్మవారి మామిడితోటలో నిర్మిస్తున్న కల్యాణ మండపం


పెనుగంచిప్రోలులో ఏర్పాటు చేస్తున్న పార్కు

రూ.80.60లక్షలతో సచివాలయాలు..

గ్రామస్తులకు అన్నిరకాల పౌరసేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. అందులోభాగంగా పెనుగంచిప్రోలులో రూ.80.60లక్షలతో రెండు సచివాలయాలు నిర్మాణం చేపట్టారు. ఓ భవనం పనులు పూర్తై ప్రజలకు సేవలందిస్తుండగా, మరో భవనాన్ని కొద్దిరోజుల్లో ప్రారంభించనున్నారు. ఒక్కో సచివాలయంలో తొమ్మిది మంది ఉద్యోగులతో పాటు ప్రతి 50కుటుంబాలకు ఒక వలంటీర్ చొప్పున ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారు.

రూ.2.10కోట్లతో డ్రైనేజీల నిర్మాణం..

గ్రామంలోని మోడల్ కాలనీలో రూ.80 లక్షలతో సీసీ రోడ్లు నిర్మించారు. అదేవిధంగా రూ.2.10 కోట్లతో పెనుగంచిప్రోలులోని ఆయావీధుల్లో డ్రైనేజీలు నిర్మించారు. రూ.10లక్షలతో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుంచి చెరువుకట్ట వరకు కొత్తగా పెద్ద విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాటు చేయటం జరిగింది. చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి రూ.5లక్షలు, పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు తారురోడ్డు నిర్మాణానికి జెడ్పీ నిధులు రూ.25లక్షలు, తుపాను కాలనీలో సీసీరోడ్డు నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరయ్యాయి. ఆయా పనులు చేపట్టాల్సి ఉంది.

ముమ్మరంగా పైపులైన్ పనులు..

గ్రామంలో 1968లో ఏర్పాటు చేసిన మంచినీటి పైపులైన్ పూర్తిగా శిథిలమై నిరుపయోగంగా మారడంతో మంచీనటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం తాగునీటి సౌకర్యం కోసం జలజీవన్ మిషన్ నిధులు రూ.4.18కోట్లు మంజూరు చేసింది. ఈనిధులతో ఇప్పటికే తూర్పుబజారున పైపులైన్ ఏర్పాటు చేశారు. రూ.2.18 కోట్లతో మునేరు అవతల నుంచి తాగునీటి పైపులైన్, ఓవర్‌హెడ్ ట్యాంక్, సంప్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు పూర్తయితే మంచినీటి సమస్య పరిష్కారమైనట్లే.

రూ.కోటితో పార్కు ఏర్పాటు..

పుణ్యక్షేత్రం గొప్పతనాన్ని ప్రతిబింబిచే విధంగా సుమారుగా రూ.కోటి నిధులతో చెరువుకట్ట వద్ద చేపట్టిన పార్క్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. చుట్టూతా ఫెన్సింగ్, గోడలు, ఊయల, జారుడు బల్లలు వంటివి ఏర్పాటు చేశారు. వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, ఫౌంటెన్‌తోపాటు గ్రామస్తులు సేద తీరేందుకు బల్లలు ఏర్పాటు చేస్తున్నారు. త్వరలోనే పార్కును ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.


కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు



తుపాను కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

రూ.14కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు..

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో రూ.14కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆలయం వద్ద టాయిలెట్ బ్లాక్, కేశఖండనశాల, భక్తుల విశ్రాంతి మందిరం, వార్షిక కల్యాణ స్థల అభివృద్ధితోపాటు మునేరు అవతల కల్యాణమండపం, ఏసీ గదులు, షెడ్లు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రత్యేక కృషితో మంజూరైన ఈనిధులతో చేపట్టిన ఆయా అభివృద్ధి పనులను ఈనెలలో ప్రారంభించేందుకు ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు..



గతంలో ఎన్నడూలేని విధంగా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో మంజూరైన రూ.14 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. పూర్తయిన నిర్మాణాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆలయ అభివృద్ధి సీఎం జగనన్న పాలనలో విప్ ఉదయభానుతోనే సాధ్యమైంది.

– జంగాల శ్రీనివాసరావు, శ్రీతిరుపతమ్మవారి ఆలయ చైర్మన్

సంతోషంగా ఉంది..



స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో పెనుగంచిప్రోలును అభివృద్ధి చేస్తున్నా. రూ.కోటితో పార్కు ఏర్పాటు చేస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో ఉన్న తాగునీటి సమస్య కూడా త్వరలో తీరనుంది. డంపింగ్‌యార్డులో తడి, పొడి చెత్త వేరుచేసి వర్మీ కంపోస్టు తయారు చేస్తున్నాం. ముఖ్యమంత్రి జగనన్న పాలనలో గ్రామంలో కోట్లాది రూపాయలతో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. – వేల్పుల పద్మకుమారి, సర్పంచి

క్లుప్తంగా

నందిగామ ఎంపీపీగా ఆకుల హనుమంతరావు



నందిగామ: అడవిరాములపాడు ఎంపీటీసీ సభ్యుడు, మండలపరిషత్ ఉపాధ్యక్షుడు ఆకుల హనుమంతరావు (రంగా) ఎంపీపీగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎంపీపీగా ఉన్న అరిగెల సుందరమ్మ అనారోగ్యం కారణంగా రాజీనామా చేయగా, ఆస్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎంపీపీ హనుమంతరావును ఎంపీడీవో వి.విశ్వనాథం, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది అభినందించారు. అనంతరం హనుమంతరావు మాట్లాడుతూ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ




గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన మట్టా వీరారెడ్డి, కౌశల్య జ్ఞాపకార్థం వారి కుమారుడు మట్టా వెంకటేశ్వరరెడ్డి కుటుంబసభ్యులు 150 ప్లేట్లను గురువారం బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పరిమి రవికుమార్, రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ప్లేట్లు బహూకరించిన వెంకటేశ్వరరెడ్డి దంపతులకు అభినందనలు తెలియజేశారు. వారిని దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచి కృష్ణా రంగారావు, ఉపాధ్యాయులు మేరుగ రామారావు, జే జ్యోతి, మార్కపూడి గ్రేస్‌మణి, పుల్లారావు, వి.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు అవగాహన



తొర్రకుంటపాలెం(జగ్గయ్యపేట): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జగ్గయ్యపేట ప్రాంతీయ రవాణా శాఖాధికారి రవికుమార్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో రోడ్డు భద్రతపై ఆటోడ్రైవర్‌లకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతలో వాహనదారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసిస్టెంట్ ఎండీటీ ఆలాం, సిబ్బంది విజయభాస్కర్, యూనియన్ నాయకులు సురేష్, దాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాక్సినేషన్



పెనుగంచిప్రోలు: స్థానిక కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు కోర్బి అనే కోవిడ్ వ్యాక్సిన్ వేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి పి.ఇందిర మాట్లాడుతూ 12 నుంచి 18ఏళ్ల లోపు వారికి ఈవ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి వేల్పుల పద్మకుమారి, హెచ్ఎం కె.జలజ, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐరీష్ విధానంలో వృద్ధురాలికి ఇంటి రిజిస్ట్రేషన్

నందిగామ: సచివాలయాల్లో చేపట్టిన జగనన్న మోడల్ కాలనీల్లో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో స్థానిక రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు కూడా భాగస్వాములు అవుతున్నారు. ముఖ్యంగా సచివాలయాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఏమైనా అనుమానాలు వచ్చినా, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని భాగ్యమ్మ అనే 72ఏళ్ల వృద్ధురాలికి సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేస్తుండగా ఆమె వేలిముద్రలు పడలేదు. దీంతో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐరిష్ ద్వారా సబ్‌రిజిస్టర్ విద్యాధరణి రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహించారు.తమ కార్యాలయ పరిధిలో ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని విద్యాధరణి తెలిపారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

జుజ్జూరు(వీరులపాడు): మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి తెలిపారు. పెద్దాపురంలోని పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి నందిగామ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ముఖ్యఅతిథిగా హాజరై డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కులను అందజేస్తారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

కులగణన సర్వేపై సమీక్ష

జుజ్జూరు(వీరులపాడు): మండలంలో కులగణన సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ రాజకిషోర్ సూచించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన రెవెన్యూ, సర్వే సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కులగణను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. కులగణనను వేగవంతం చేసి త్వరితగతిన ముగించాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, రెవెన్యూ, కులగణన సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్సపొందుతున్న యువకుడి మృతి

నందిగామ: రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా(20) మరో ఇద్దరుమిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై బుధవారం నందిగామకు వస్తున్నారు.ఈ క్రమంలో మండలంలోని పల్లగిరి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగుల్‌మీరాను విజయవాడ తరలించగా గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తెలిపారు.

వివాహితపై దాడి


గాయపడిన సత్యశ్రీ

జగ్గయ్యపేట అర్బన్: వివాహితపై గుర్తుతెలియనివ్యక్తి పదునైన ఆయుధంతో దాడిచేయడంతో ఆమె తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి జగ్గయ్యపేట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ జానకీరాం కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా తణుకు ప్రాంతానికి చెందిన గోపిరెడ్డి సత్యశ్రీ(36)అనే మహిళ నాలు గేళ్లగా పట్టణంలోని సీతారామపురంలో కొత్త వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో నివాసం ఉంటూ స్థానిక ముక్యాలరోడ్‌లో డెయిరీ షాపు నడుపుకుంటూ జీవిస్తుంది. భర్త విజయవాడలో వ్యాపారం చేస్తుండగా, ఇంటర్ చదువుతున్న బిడ్డ ఆమెతోనే ఉంటోంది.

ఈక్రమంలో బుధవారం రాత్రి తనఇంటి ముందు నిలుచుని ఫోన్‌లో మాట్లాడుతుండగా గుర్తుతెలియనివ్యక్తి బైక్‌పై హెల్మెట్ ధరించి వచ్చి పదునైన ఆయుధంతో ఆమెపై దాడిచేసి పారిపోయాడు. ఈ ఘటనలో బలమైన గాయం అవడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు గమనించిన ఆమెను ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సీఐ జానకీరామ్ సందర్శించి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పోలీసులు, ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

50 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

కొత్తపేట(కంచికచర్ల): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేద, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేస్తుండటంతో టీడీపీవారు, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి భారీగా చేరుతున్నట్లు ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు.

మండలంలోని కొత్తపేటలో గురువారం రాత్రి 50 కుటుంబాలవారు టీడీపీ నాయకుడు ముప్పాళ్ల శివాజీ ఆధ్వర్యంలో ఆపార్టీని వీడి ఎమ్మెల్సీ అరుణకుమార్ సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలోకి చేరారు. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమపథకాలు అందిస్తోందన్నారు. ఓవైపు రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తూ, మరోవైపు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి రెండోసారి ముఖ్యమంత్రిగా చూడాలని రాష్ట్ర ప్రజలందరూ ఎదురుచూస్తున్నారన్నారు. ఇటీవల గ్రామంలో ఎస్సీలు సాగుచేసుకుంటున్న లంకభూములను వారికి ఇచ్చేందుకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టిందని గుర్తుచేశారు. అందరూ కలసికట్టుగా పనిచేసి మరోసారి నందిగామలో, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో పులి బాబూరావు, పులి మోహనరావు, చాట్ల గురవయ్య, ముప్పాళ్ల శ్రీనివాసరావు, గంధం చినగురవయ్య, చాట్ల శ్రీనివాసరావు, చాట్ల పేతురు, పులి శ్రీనివాసరావు, పులి నాగేశ్వరరావు, మందా రమేష్, చాట్ల ఆనందరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచి పత్తిపాటి సునీత, ఉపసర్పంచి ముప్పాళ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాధరావు, మాజీ సర్పంచి ముప్పాళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్తిపాటి కృష్ణారావు, వేల్పుల రమేష్, వెలగలేటి బాబు, పాల్గొన్నారు.

దేవినేని చంద్రశేఖర్‌కు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాళి


కంచికచర్ల : మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సోదరుడు దేవినేని చంద్రశేఖర్ (52) హైదరాబాద్‌లో అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. చంద్రశేఖర్ కుటుంబసభ్యులు ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన కంచికచర్ల తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కంచికచర్ల వెళ్లి చంద్రశేఖర్ భౌతికకాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ దేవినేని చంద్రశేఖర్ బతికి ఉన్న సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బలోపేతం కోసం పనిచేశారన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. చంద్రశేఖర్‌కు నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, కంచికచర్ల, పరిటాల సొసైటీ అధ్యక్షులు కాలవ పెదబాబు, మాగంటి వినయభూషణరావు, నాయకులు చింతా రవీంద్రనాథ్, వేల్పుల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ నివాళి..

దేవినేని చంద్రశేఖర్ భౌతికకాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. చంద్రశేఖర్ కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శరవేగంగా కల్యాణ మండపం పనులు

- రూ.3.50కోట్లు మంజూరు..
- ఆధునిక వసతులతో నిర్మాణం
- ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్న విప్ ఉదయభాను


పేటలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం

జగ్గయ్యపేట అర్బన్: దశాబ్దాలుగా జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన తిరుమల తిరుపతి దేవస్థానం వారి కల్యాణ మండప నిర్మాణం త్వరలో సాకారం కానుంది. స్థానిక చిల్లకల్లు రోడ్‌లో వైఎస్ సర్కిల్ వద్ద చేపట్టిన టీటీడీ కల్యాణ మండపం పనులు శరవేగంగా సాగుతున్నాయి. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేట పట్టణ జనాభా సుమారు 70వేలు ఉండగా, నియోజకవర్గ వ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలు వివాహాది శుభకార్యాలు నిర్వహించేందుకు తగిన సదుపాయం లేక ఇబ్బందిపడుతున్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాల రేట్లు భారీగా ఉంటుండటంతో ఆర్థికంగా అవస్థలుపడుతున్నారు. ఈక్రమంలో ఈసమస్యకు పరిష్కారంగా టీటీడీ సహకారంతో కల్యాణమండపం నిర్మాణానికి 2009లో ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను కృషిచేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సహకారంతో టీటీడీ ద్వారా రూ1.30కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులకు పబ్లిక్ కాంట్రిబ్యూషన్ కింద రూ.13లక్షలు కూడా జమచేశారు. సుమారు ఎకరంన్నర స్థలంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే అనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల కారణంగా కల్యాణమండపం పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

రూ.2.50కోట్లు మంజూరు..

ఈ నేపథ్యంలో 2019లో విప్ సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కల్యాణ మండపం విషయాన్ని అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో చెల్లించిన రూ.13లక్షలతోపాటు రామ్‌కో సిమెంట్స్ అందించిన రూ.37లక్షలు కలిపి మొత్తం రూ.50లక్షలను పబ్లిక్ కంట్రీబూషన్‌గా టీటీడీకి చెల్లించారు. దీంతో టీటీడీవారు రెండు అంతస్తులతో కూడిన ఏసీ కల్యాణ మండప నిర్మాణానికి రూ.2.50 కోట్లు, మంజూరు చేశారు. ఈ నిధులతో గ్రౌండ్ ఫ్లోర్‌లో డైనింగ్ హాల్, కిచెన్, టాయిలెట్స్ తదితర 6 గదులు, పైఅంతస్థులో 500 మంది కూర్చునేలా కల్యాణ మండపం రెండు గదులు నిర్మిస్తున్నారు.

మరో కోటి మంజూరు..

ఇటీవల డైనింగ్ హాల్, కిచెన్, వాటర్ సంపు నిర్మాణాల నిమిత్తం మరో కోటిరూపాయల నిధులను విప్ ఉదయభాను మంజూరు చేయించారు. దీంతో కల్యాణమండపం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తిచేయించి కల్యాణ మండపాన్ని జగ్గయ్యపేట వాసులకు అందుబాటులోకి తెచ్చేందుకు నిర్మాణ పనులను విప్ ఉదయభాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పనులు కూడా త్వరలోనే పూర్తయి, కల్యాణమండపం అందుబాటులోకి రానుంది. దీంతో జగ్గయ్యపేట వాసుల కల్యాణ మండపం కల తీరినట్లవుతుందని స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

11న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ సమావేశం


మాట్లాడుతున్న మండవ శ్రీనివాస్‌గౌడ్

గంద్రాయి(జగ్గయ్యపేట): ఈనెల 11వతేదీన గంద్రాయిలో నిర్వహించే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల బీసీ సెల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్ కోరారు. గంద్రాయిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలస్థాయిలో నిర్వహించే బీసీ సెల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పాల్గొంటారని తెలిపారు. సమావేశానికి బీసీలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ కన్వీనర్ చాపల వెంకటేశ్వర్లు, సర్పంచి కొత్తపల్లి లూర్దుమేరి, నాయకులు మల్లేశ్వరరావు, కనపర్తి ప్రసాద్, సలాం తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు


ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు హాజరైన లబ్ధిదారులు

గండేపల్లి(కంచికచర్ల) : మండలంలోని గండేపల్లి గ్రామ సచివాలయంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఈరిజిస్ట్రేషన్ ప్రక్రియను సర్పంచి బొక్కా రవికుమార్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తోందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ మాట్లాడుతూ గ్రామంలో 270మందికి జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్లు కూడా మంజూరు చేశారన్నారు. ఇప్పటివరకు 87మంది లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ అవ్వగా, 18 రిజిస్ట్రేషన్లు పూర్తయినట్లు తెలిపారు. వీఆర్వో వెంకటేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అధికారులకు శిక్షణ


మాట్లాడుతున్న ఆర్వో వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా సివిల్ సప్లయిస్ డీఎం జి.వెంకటేశ్వర్లు సూచించారు. ఎన్నికల విధుల్లో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో నియోజకవర్గస్థాయిలోని సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు పాటించాల్సిన నియమాలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. విధుల్లో ఖచ్చితత్వం, పారదర్శకత ఉండాలని ఆయన సూచించారు. నియోజకవర్గంలో మొత్తం 27మంది సెక్టోరల్ అధికారులకు విధులు కేటాయించగా, వారిలో 22మంది రెగ్యులర్, ఐదుగురు రిజర్వుడ్‌లో ఉంటారని తెలిపారు. పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల తహసీల్దార్లు జీవీ.శేషగిరి, ఎం.రవి, అమ్మాజీ, ఎలక్షన్ డీటీ యు.కిషోర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదత్తసాయి మందిరం వార్షికోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరం వార్షికోత్సవాలను రెండోరోజు గురువారం ఘనంగా నిర్వహించారు. బాబాకు ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో బాబావారిని ఉంచి మధురానగర్ పురవీధుల్లో సాయిబాబా భక్తులు భిక్షాటన చేశారు. దారి పొడవునా భక్తులు బాబావారికి హారతులతో స్వాగతం పలికి భిక్ష వేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం శ్రీవిష్ణు, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.